నత్తనడకన బ్రిడ్జీల నిర్మాణ పనులు

- ఐదేళ్లుగా పూర్తికాని తుంగపాడు, మాటూరు బ్రిడ్జిల నిర్మాణం
- బాబుసాయి పేట బ్రిడ్జి పనులు కూడా అంతే..
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

త్రిపురారం : దేవుడు వరమిచ్చినా పూజారి కనికరించలేదు అన్న చందాల తయారైంది మండలంలోని అభివృద్ధి పనుల పరిస్థితి. అధికారుల అలసత్వం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో సంవత్సరాలు గడుస్తున్నా సంబంధిత పనులు ముందుకు సాగడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మండలంలోని బాబుసాయి పేట గ్రామం వద్ద తుంగపాడు బొందంపై నూతన బ్రిడ్జి నిర్మాణానికి సుమారు రూ. 1కోటీ80 లక్షల నిధులు, అల్వాల పాడు గ్రామంలో నూతన వంతెనకు రూ. 1కోటి, మాటూర్ గ్రామంలో నూతన బ్రిడ్జి నిర్మాణానికి రూ. 1కోటి నిధులు కేటాయించింది. అయితే అల్వాలపాడు వద్ద వంతెన పనులు చేపట్టి సుమారు ఐదేళ్ల గడుస్తున్న పనులు పూర్తికాలేదు. పుష్కరాల సమయంలో తుంగపాడు నుంచి అడవిదేవుల పల్లికి డబుల్ రోడ్డు నిర్మించారు. ఇందులో భాగంగా మాటూర్ గ్రామం వద్ద వంతెన పనులు చేపట్టినా పుష్కరాల సమయం నుంచి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పనులు పూర్తి కాలేదు. ప్రమాదకరంగా ఇనుప చువ్వలు వదిలేయడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. బాబుసాయి పేట వద్ద బ్రిడ్జి నిర్మాణం చేపట్టి సంవత్సర కాలం గడుస్తున్నా పనులను సాగదీస్తున్నారు. దీంతో ఎన్నో సార్లు వర్షాలు వచ్చినప్పుడు నూతన వంతెనల వద్ద వేసిన తాత్కాలిక రోడ్లు కొట్టుకపోయి ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్లు వారి ఇష్టం వచ్చిన విధంగా పనులు చేస్తున్నారు. దీంతో అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణాలతో వాహనదారులు ఇటు ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పటికైనా సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణాలను పరిశీలించి పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


అల్వాలపాడు వద్ద అసంపూర్తిగా బ్రిడ్జి నిర్మాణం


బాబుసాయి పేట వద్ద పనులు పూర్తికాని బ్రిడ్జి

నిబంధనలకు పాతర

అభివృద్ధి పనుల్లో నిబంధనలను అధికారులు పటించుకోవడం లేదు. దీంతో కాట్రాక్టర్లు వారు చేసిందే పని అన్నట్లుగా తయారైంది. మండలానికి పాలెం, రామడుగు గ్రామాల నుంచి ఇసుక తెప్పించుకోవడానికి అవకాశం ఉన్నా ఇసుకను ఉపయోగించుకోవడం లేదు. వంద శాతం చిప్స్ ద్వారనే నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో కొద్ది రోజులకే పగుళ్లు వస్తున్నాయి. గ్రామాల్లో వెవరైనా అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నారని గ్రామాల్లోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి



గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వాలు నిధులు కేటాయించినా ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం లేదు. దీంతో అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై పనులు పూర్తి చేయకుండా సాగదీస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో అయా ప్రాంతాల్లో ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తుంది.

– పులి నరేష్, మాటూర్

నాసిరకంగా బ్రిడ్జి నిర్మాణం



అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ఎక్కడా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. నిబంధలన ప్రకారం ఇసుక ఉపయోగించాల్సి ఉన్నప్పటకీ వాడకుండా చిప్స్‌తో పనులు చేస్తున్నారు. ఇసుక అందుబాటులో ఉన్నా వినియోగించడం లేదు. నాణ్యత పాటించకపోతే ప్రజాధనం వృథా అవుతుంది.

– కిలారి సైదులు, బెజ్జికల్

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ఎఫ్‌సీఐ వద్ద గల సబ్‌స్టేషన్ పరిధిలో 33కేవీ లింక్ లైన వర్క్‌లో భాగంగా సోమవారం ఉదయం 7గంటల నుంచి 10:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని హనుమాన్‌పేట, ప్రకాశ్‌నగర్, బాపూజీనగర్, అశోక్‌నగర్, రెడ్డీకాలని, నాగార్జుననగర్, ముత్తిరెడ్డికుంట, గాయత్రినగర్ లోని కొన్ని ఏరియాలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు గమనించి సిబ్బంది సహకరించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న నిమ్స్ డాక్టర్

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని బాలాజీనగర్ తండాలో ఆదివారం నల్లగొండ నిమ్స్ ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 150 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాల్వాయి వెంకటరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వైద్య సేవలు అందించేందుకు గాను వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బస్సీలాల్, గ్రామస్తులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులు ఉన్నారు.

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న పద్మశాలి సంఘం నూతన పాలకవర్గ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : మార్కండేయ పద్మశాలి సంఘం నందిపాడు నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో నిర్వహించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం నందిపాడు పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడిగా కొంగరి నారాయణ, అధ్యక్షుడిగా జెల్లా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులుగా గుంటి సత్తమయ్య, కె. సీతారాములు, గౌరవ సలహాదారులుగా బొల్ల రామనర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా రుద్ర సైదులు, సహాయ కార్యదర్శిగా నక్క నర్సింహ్మ, కోశాధికారిగా గుంటి బ్రహ్మయ్యలతో పాటు కార్యవర్గ సభ్యులు నర్సింహ్మారావు, గుడూరు లక్ష్మణ్, పులిపాటి రవి, మధు, కృష్ణమూర్తి, కృష్ణయ్యలు ప్రమాణాస్వీకారం నిర్వహించారు.

కాంగ్రెస్ ప్రచార రథం ప్రారంభం

నల్లగొండ: పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ ప్రచార రథాన్ని కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య పాల్గొన్నారు.

స్నేహితురాలి కూతురు వివాహానికి చేయూత

చిట్యాల: తమతో చదువుకున్న స్నేహితురాలి కూతురు వివాహానికి ఆర్థిక చేయూత అందించి అండగా నిలబడ్డారు ఆమెతో కలిసి చదువుకున్న స్నేహితులు. వివరాలు.. చిట్యాల పట్టణానికి చెందిన కసిరెడ్డి ప్రభ కూతురు శ్రీజ వివాహం ఆదివారం జరిగింది. వివాహ ఖర్చులకుగాను ప్రభతో కలిసి చదువుకున్న 1995–96 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు రూ.26,500, ఇంటర్ స్నేహితులు రూ.68,964 అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మూడ వెంకటాద్రి, అమరోజు దయానంద్, జొర్రిగల జ్యోతి, పెద్దగోని మాధవి, మూడ ఉమారాణి, సత్యనారాయణ, నర్సిరెడ్డి, భాగ్యమ్మ, అనంతాచారి, సుజాత, వెంకన్న, ప్రభావతి, జ్యోతి, జయమ్మ, కుమారస్వామి, లింగయ్య, వినయ్ పాల్గొన్నారు.

24న ఓబీసీ మోర్చా సమ్మేళనం

దేవరకొండ : ఈనెల 24న నల్లగొండ జిల్లా కేంద్రంలో బీజేపీ ఓబీసీ మోర్చా సామాజిక సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజుయాదవ్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం దేవరకొండ పట్టణంలో జరిగిన ఓబీసీ మోర్చా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమ్మేళనంలో బీసీలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించడం, ఓబీసీ సమస్యల పరిష్కారం, కేంద్రంలో 27మంది బీసీలకు సముచిత స్థానం వంటి అంశాలపై చర్చించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు నేతాళ్ల వెంకటేష్ యాదవ్, చంఢీశ్వర్ రెడ్డి, శంకర్, పున్న నాగరాజు, శంకర్, సైదులు, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన


హాలియా : విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

హాలియా : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం ఆ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతిష్ఠాచార్యులు రాయప్రోలు మురళి గురుస్వామి, శ్రీరామశర్మ, ప్రతాపురం వెంకటాచార్యులు, అబ్రపూడి రమణశర్మ, ఆధ్వర్యంలో యంత్రరాజ ప్రతిష్ఠ, గంగమ్మ తల్లి విగ్రహప్రతిష్ఠ, గర్తన్యాసం, అమ్మవారికి పంచామృత అభిషేకం, అలంకరణ సర్వదర్శనం, పూర్ణాహుతి, శాంతికల్యాణం తదితర పూజలను నిర్వహించారు. ఈ వేడుకల్లో బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండు రంగారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ నామస్మరణ చేయడం వల్ల ప్రశాంత జీవనం ప్రాప్తిస్తుందన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పాండురంగారెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు గౌనీ రాజా రమేష్ యాదవ్, కాశయ్య, బూడిద గోవింద్, గంధం రామయ్య , శ్రీనివాస్, మల్లిఖార్జున్, రాజశేఖర్, బాలకృష్ణ, కొండల్, కూరాకుల శ్రీనివాస్, తిరుపతయ్య, ఆర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వేంపాడ్‌లో విగ్రహ పతిష్ఠాపన మహోత్సవం

నిడమనూరు : మండలంలోని వేంపాడ్‌లో నూతనంగా నిర్మించిన రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు.ఈ సందర్భంగా హోమాలు, యాగాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భాస్కర్‌రావుపై విచారణ జరపాలి

మిర్యాలగూడ : ఫోన్ ట్యాపింగ్‌లో అక్రమాలకు పాల్పడిన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావుపై విచారణ జరపాలని జిల్లా కాంగ్రెస్ నాయకుడు ధీరావత్ స్కైలాబ్‌నాయక్ అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మిర్యాలగూడ నియోజకవర్గంలో రాజకీయ నాయకులు, వ్యాపారస్తులు, అధికారులకు సంబంధించిన 150 మంది ఫోన్ ట్యాపింగ్ చేయించి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌తో ఒక డివిజన్ స్థాయి అధికారిని బెదిరించి పనులు చేయించుకున్నారని, ఒక రైస్ మిల్లర్‌ను బెదిరించి రూ.2 కోట్లు తీసుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ బస్సు యాత్ర మిర్యాలగూడ నుంచి ప్రారంభిస్తున్నారని, ఏ మొఖం పెట్టుకోని మిర్యాలగూడకు వస్తున్నారని ప్రశ్నించారు. ఓట్లు అడిగే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదన్నారు. రఘువీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

రఘువీర్‌రెడ్డి గెలుపు ఖాయం


కాంగ్రెస్ ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి


దేవరకొండ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

మిర్యాలగూడ : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపు ఖాయం అయిందని, అత్యధిక మెజార్టీ కోసం కార్యకర్తలు కృషిచేయాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఉమామహేశ్వరస్వామి ఆలయం వద్ద కాంగ్రెస్ ఎన్నికల ప్రచార రథాలకు పూజలు చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రఘువీర్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషిచేయాలన్నారు. మిర్యాలగూడ నుంచి అత్యధిక మెజారిటీ వచ్చేలా కష్టపడాలని ఆయన కార్యకర్తలకు సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలన్నారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పాల్గొన్నారు.

రఘువీర్‌రెడ్డి గెలుపునకు కృషిచేయాలి

దేవరకొండ : పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి గెలుపునకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పిలుపునిచ్చారు.ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన యువజన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి అభ్యర్థి గెలుపునకు పాటుపడాలని కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపకు వెళ్లి వివరించాలని ఆయన సూచించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవనర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రాష్ట ప్రధాన కార్యదర్శి కొర్ర రాంసింగ్ నాయక్, జర్పుల లక్ష్మీ, జయంత్‌రెడ్డి, విజయ్, సతీష్ పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో మాజీ ఎమ్మెల్యే భగత్

గుర్రంపోడు : మండలంలోని తెరాటిగూడెం గ్రామంలో ఆదివారం సీతారామచంద్రస్వామి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతన కల్గి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కల భాస్కర్, పెద సైదులు, రామస్వామి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భగత్

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న జొన్నలగడ్డ వెంకట్‌రెడ్డి

త్రిపురారం : మండలంలోని కొణతాలపల్లి గ్రామంలో నేటి నుంచి 24వ తేదీ వరకు శ్రీ సీతారామచంద్రస్వామి పరివార దేవతల సీతా, రామ, లక్ష్మణ, ఆంజనేయ, గణపతి, ద్వారపాలకుల ధ్వజ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కొణతాలపల్లి మాజీ సర్పంచ్ జొన్నలగడ్డ వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కొటి రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించామని తెలిపారు.

సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి

హాలియా : హాలియా పట్టణంలో సోమవారం నిర్వహించనున్న కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పట్టణంలోని దేవరకొండ రోడ్డు సమీపంలో ఉన్న పాత ఐటీఐ కళాశాల ప్రాంగణం లో సోమవారం సాయంత్రం 5గంటలకు నిర్వహించే నియోజకవర్గ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, సాగర్ ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డితో పాటు పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. నియోజకవర్గ సన్నాహక సమావేశానికి మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

హిల్ కాలనీలో తాగునీటి కష్టాలు


పగిలిపోయిన ఎయిర్‌వాల్వ్‌కు మరమ్మతులు చేస్తున్న ఎన్నెస్పీ సిబ్బంది

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపల్ పరిధిలోని హిల్ కాలనీలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు నీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. వారం క్రితం మోటారు పంప్ మరమ్మతులకు రావడంతో నీటి పంపిణీ నిలిచిపోయి ఇబ్బందులు పడ్డారు. ఆ సమస్య పరిష్కారమైంది. పైలాన్‌లో కాంట్రాక్టర్ కొత్త పంప్‌ను సరైన రీతిలో మోడిపై చేయించి తేక పోవడంతో ఆ కాలనీకి మూడు రోజులు నీటి సరఫరా నిలిచి పోయింది.ఎన్నెస్పీ సిబ్బంది హైదరాబాద్ డీలర్ దగ్గరకు తీసుకెళ్లి కంప్రెషర్‌ను సరైనరీతిలో ఆధునీకరించి తెచ్చి బిగించడంతో సమస్య పరిష్కరించారు. ప్రస్తుతం ఆకాలనీకి తాగునీరు సరఫరా అవుతుంది. హిల్‌కాలనీకి నీరు వచ్చే పైప్‌లైన్‌కు పలు చోట్ల ఎయిర్‌వాల్స్ ఉన్నాయి. హిల్‌కాలనీ–పైలాన్ మద్యగల ముత్యాలమ్మ గుడి ఎదురుగా పాతరోడ్డు వెంట ఉన్న ఎయిర్‌వాల్ నీటి వత్తిడికి పగిలి పోయింది. దానికి వెల్డింగ్ పెట్టి నీటి సరఫరాను కొనసాగించగా ప్రెషర్‌కు వాచర్‌తో పాటు ఎయిర్‌వాల్ పైపు పగిలింది. దాని స్థానంలో కొత్తది తేవడానికి సిబ్బంది నల్లగొండకు వెళ్లినట్లు సమాచారం.అది తెచ్చి బిగిస్తేనే హిల్‌కాలనీకి నీటి సరఫరా పునరుద్ధరిస్తారని ఎన్నెస్పీ సిబ్బంది తెలిపారు.

పార్టీ మారినోళ్లను పట్టించుకోవద్దు


ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎంసీకోటిరెడ్డి

త్రిపురారం : అధికారం ఉన్నప్పుడు పదవులు అనుభవించి పార్టీ మారిన వ్యక్తులు ఏ పార్టీలో ఉన్నా ప్రమాధమేనని అలాంటి వారిని కార్యకర్తలు పట్టించుకోవద్దని ఎమ్మెల్సీ కోటిరెడ్డి, సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని త్రిపురారం మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగిందని, అమలు చేయలేని హామీలతో కాంగ్రెస్ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందన్నారు. గత ఎన్నికల్లో నిర్వహించిన పొరపాట్లు తిరిగి జరగకుండా జాగ్రత్తగా పడుతూ గ్రామ స్థాయిలో కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని పార్టీలో ప్రతి ఒక్కరికి సుమచిత స్థానం ఉంటుందని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కామర్ల జానయ్య, పావనగుండ్ల వెంకటాచారి, వెంకటేశ్వర్లు, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుదాకర్ రెడ్డి, వనం సత్యనారాయణ, ఉల్లెదుల ఏల్లయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


పూజల్లో ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, తదితరులు

హాలియా : ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాతంత లభిస్తుందని సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం అనుముల మండలంలోని కొత్తివేనిగూడెం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పసునూరు కిరణ్‌రెడ్డి ఆహ్వానం మేరకు గ్రామంలోని శ్రీ లక్ష్మీ రేణుక ఆలయాన్ని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సందర్శించి ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, హాలియా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చింతల చంద్రారెడ్డి, నాయకులు దేప తిరుపతిరెడ్డి, కుందూరు రాజేందర్‌రెడ్డి, కలసాని చంద్రశేఖర్, మేరెడ్డి వెంకట నరసింహారెడ్డి, వెంకట రమణారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు మారుపాక నరసింహ, కొంగరి రమణయ్య, పేర్ల రవి తదితరులు ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవ పూజలు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాయంలో ఆలయ వార్షికోత్సవం కొనసాగుతుంది. ఆదివారం ఆలయంలో చైత్ర శుద్ధ త్రయోదశి పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, సేవాకాలం, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, మంగళాశాసనం, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ అనంతరం గరుడసేవతో స్వామివార్ల ఊరేగింపు కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈట లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై శ్రీనివాసచార్యులు, హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు యరగాని భిక్షం, యరగాని నర్సింహారావు, గురవయ్య, వీరబాబు, భక్తులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా చెరువు మట్టి రవాణా


చిన్నగూడెం చెరువు నుంచి మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు

మాడుగులపల్లి : మండలంలోని పలు గ్రామాల్లో చెరువు మట్టిని కొందరు అక్రమంగా రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. ధర్మపురం, కన్నెకల్లు, చెరువుపల్లి, తోపుచర్ల గ్రామాల్లోని చెరువుల్లో గతంలో మట్టిని తవ్వి డంపు చేసి గుట్టు చప్పుడు కాకుండా ఇటుక బట్టీలకు తరలించినా అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. ఆదివారం ఆగామోత్కూర్ ఆవాసం చిన్నగూడెం చెరువులో కొందరు వ్యక్తులు ట్రాక్టర్లతో మట్టిని తవ్వి తరలిస్తుండడంతో స్థానికులు మీడియాకు సమాచారం అందించారు. ఈ విషయంపై నీటిపారుదల ఏఈని వివరణ కోరగా రైతులు అనుమతితో తమ పొలాలకు మట్టిని తరలించుకుంటున్నారని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా చెరువు మట్టి తవ్వితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హనుమత్ గాయత్రీ యజ్ఞం

రామగిరి (నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని తులసీనగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం కోటయ్య గురుస్వామి ఆధ్వర్యంలో హనుమత్ గాయత్రీ యజ్ఞం, అభిషేకం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ మాల దీక్ష స్వాములు అభిషేకం, గాయత్రీ యజ్ఞం నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, బొల్ల నాగరాజు, గద్దం భరత్, శివకుమార్, హనుమాన్ దీక్ష స్వాములు, భక్తులు పాల్గొన్నారు.


అభిషేకం నిర్వహిస్తున్న కోటయ్య గురుస్వామి

మోత్కుపల్లికి ఎమ్మార్పీఎస్ టీఎస్ నాయకుల పరామర్శ

దేవరకొండ : మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులును ఆదివారం దేరకొండకు చెందిన ఎమ్మార్పీఎస్‌టీఎస్ నాయకులు హైదరాబాద్‌లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముదిగొండ ఎల్లేష్ మాట్లాడుతూ ఒక్కరోజు దీక్ష చేయడంతో మోత్కుపల్లి నర్సింహులు ఆరోగ్యం క్షీణించడంతో ఆయన అమీర్‌పేట్‌లోని వెల్‌నెస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మాదిగల ఆత్మగౌరవం దెబ్బతినే విధంగా నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన ముఖ్యమంత్రిని కోరారు. మోత్కుపల్లి త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

తప్పిపోయిన వృద్ధురాలిని కుమార్తెకు అప్పగింత



కుమార్తెకు వృద్ధురాలిని అప్పగిస్తున్న కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ

మాడుగులపల్లి : మతిస్థిమితం కోల్పోయి ఇంట్లో నుంచి తప్పిపోయిన వృద్ధురాలిని స్థానికుల సాయంతో మాడుగులపల్లి పోలీసులు చేరదీసి ఆమె కుమార్తెకు అప్పగించారు. మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన గోరంట్ల పుల్లమ్మకు (70) మతిస్థిమితం లేదు. నాలుగు రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వచ్చి తప్పిపోయి మాడుగులపల్లి మండల కేంద్రానికి చేరింది. శనివారం దీనంగా ఓ వీధిలో సంచరిస్తుండడంతో స్థానికులు చేరదీసి భోజనం పెట్టి మాట్లాడించే ప్రయత్నం చేశారు. తన పేరు పుల్లమ్మ అని వెంకటాద్రిపాలెం గ్రామమని చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వృద్ధురాలికి పోలీస్ స్టేషన్ స్వీపర్ ఇంట్లో తాత్కాలికంగా ఆశ్రయం కల్పించారు. ఆమె చెప్పిన వివరాల ప్రకారం ఎస్ఐ శోభన్‌బాబు చిరునామా ఆరా తీసి కుమార్తె జాల సైదమ్మకు సమాచారం ఇచ్చారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కుమార్తె సైదమ్మకు ఏఎస్ఐ జాఫర్, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ వృద్ధురాలిని అప్పగించారు.

29 నుంచి సాయి మందిర వార్షికోత్సవం

నకిరేకల్: మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి బాబా ఆలయంలో ఈ నెల 29 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న 17వ ఆలయ వార్షికోత్సవం, శ్రీ జ్ఞాన సరస్వతీ దేవి నవమి వార్షికోత్సవానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను ఆదివారం ఎమ్మెల్యే వేముల వీరేశం విడుదల చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ సుకన్య,ట్రస్ట్ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

త్రిపురారం : మండలంలోని పెద్దదేవుల పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998–1999లో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఘనంగా ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి మధుర స్మృతులను తులచుకొని సంతోషంగా గడిపారు. 25 ఏళ్ల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆప్యాయంగా పలకరించుకుంటు సంతోషంగా గడిపారు. అనంతరం వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవి కు మార్, పూర్వ ఉపాధ్యాయులు వెంకట్ రెడ్డి, నాగేశ్వర రావు, శ్రీనివాస్, శేఖర్, కొల్లి నర్సయ్య, మోదాల శ్రీనివాస్, బత్తుల రామకృష్ణ, అంబటి పాపయ్య, మాధవి, శ్రీలత, జానపాటి నాగయ్య, రవి, అంబటి కృష్ణ, జలీల్, సాయన్న, ఏడుకొండలు, శ్రీనివాస్, కమల, గంగయ్య పాల్గొన్నారు.